సమస్యల పరిష్కారమే ధ్యేయం

- పబ్లిక్ కాంటాక్ట్‌లో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ
- బస్తీలు, కాలనీల్లో పర్యటించిన అధికారులు, కార్పొరేటర్లు
- నేరుగా సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తామని హామీ
- ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్న అధికారులు


కాలనీ కాంటాక్ట్ కార్యక్రమంలో కాలనీవాసులతో మాట్లాడుతున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని కాలనీల్లో శుక్రవారం జరిగిన 'పబ్లిక్ కాంటాక్ట్' కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి రంగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం ప్రతికాలనీ, బస్తీ, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లలోని సమస్యల పరిష్కారమే ధ్యేయమన్నారు.

- జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ప్రత్యక్షంగా సమస్యలు పరిశీలించి పరిష్కరించుకోవడానికి ఇది చక్కటి వేదికన్నారు. సుమారు 15 విభాగాల అధికారులు ఒకే వేదికను పంచుకోవటం శుభపరిణామన్నారు. సమస్యలపై నేరుగా చర్చించి సమన్వయంతో పరిష్కరించుకునే అవకాశం అధికారులకు ఉంటుందన్నారు. డివిజన్ల ప్రజలు, కార్పొరేటర్లు సమస్యలు ఉంటే అధికారులు చూపించి పరిష్కరించుకోవాలని సూచించారు.
- రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్య, నాలా సమస్య, ఫుట్‌పాత్, పార్కు విధి దీపాలు, తడి చెత్త, పొడిచెత్త నిర్వహణ, దోమల బెడద, కుక్కల బెడద రక్షణ చర్యలు, మహిళ సంరక్షణ చర్యలు, విద్యుత్ లైన్‌లు వంటి వివిధ సమస్యలపై తెలుసుకొని త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం ప్రదర్శించొద్దని హెచ్చరించారు.
- ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, సీఐ సురేందర్, అధికారులు ఏఈ ఆశా, ఏఎంహెచ్‌ఓ మమత, జలమండలి డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ ప్రియాంక, వీధి లైట్లు ఏఈ మృదుల, టీపీఎస్ సోమేశ్, వెటర్నరీ డాక్టర్ లింగస్వామి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


ఫతేనగర్ డివిజన్‌లో ఫిర్యాదులు, వినతులు స్వీకరిస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

ప్రజలు తెలిపిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

మూసాపేట: కాలనీల్లోని సమస్యల పరిష్కార ధ్యేయంగా పబ్లిక్ కాంటాక్ట్‌ను నిర్వహిస్తున్నామని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని భరత్‌నగర్ శ్రీపోచమ్మ తల్లి గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో సంబంధిత అధికారులతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తాగునీటి ప్రెషర్ సమస్య, స్పీడ్ బ్రేకర్లు లేకపోవటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అదే విధంగా ఎండలు ఎక్కువగా ఉండటంతో తాగునీటి సమస్య రాకుండా చూడాలని కోరారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ నోడల్ ఆఫీసర్ రవి, ఏఈ పవన్‌రెడ్డి, జలమండలి అధికారి రాజు, జలమండలి మేనేజర్ విలియమ్ ప్రకాష్, ట్రాఫిక్ ఎస్‌ఐ కృష్ణ, ఫతేనగర్ అధ్యక్షుడు కంచి భిక్షపతి, జనరల్ సెక్రటరీ సుదర్శన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నేత భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతున్నాం

ఓల్డ్ బోయిన్‌పల్లి: డివిజన్‌లో ఏర్పాటు చేసిన పబ్లిక్ కాంటాక్ట్‌లో కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ శుక్రవారం అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లోని సమస్యలను ప్రజలు వారికి వివరించి వినతి పత్రాలను అందజేశారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతున్నామని ఆయన డివిజన్ ప్రజలకు హామీ ఇచ్చారు. బస్తీ దావాఖానాకు వచ్చే వారికి కోసం సొంత డబ్బుతో కార్పొరేటర్ కుర్చీలను ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మక్కాల నర్సింగ్‌రావు, నాయకులు కనకరాజుయాదవ్, బాలరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, మక్కాల అశోక్, పోచయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



అంజయ్యనగర్‌లో ప్రజల సమస్యలను వింటున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, అధికారులు

ఉదాసీన్ చేపట్టే నిర్మాణాలు చరిత్రలో నిలిచిపోతాయి

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- వేద పాఠశాల, యజ్ఞ శాల, గోశాల శంకుస్థాపన పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో ఉదాసీన్ మఠం వారు మే 5వ తేదీన జరగబోయే సంత్ నివాస్, వేద పాఠశాల, యజ్ఞ శాల, గోశాల భూమి పూజ శంకుస్థాపన కార్యక్రమాలకు సంబంధించిన పనులను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఉదాసీన్ మఠం వారు కూకట్‌పల్లిలోని 540 ఎకరాల స్థలంలో ఎన్నో మంచి కార్యక్రమాలు నిర్వహించడానికి పూనుకుందన్నారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా దేవాలయాలు, యోగశాలలు, అనాథ పిల్లలకు విద్యను అందించే విద్యాలయాలు, పార్కులు అనేక చారిత్రాత్మక కట్టడాలను నిర్మించేందుకు ముందుకు రావటం మన అదృష్టమన్నారు. హైదరాబాద్‌కు వచ్చిన ప్రతి ఒక్కరూ ఈ ప్రాంతాన్ని సందర్శించకుండా వెళ్లలేరని తెలిపారు. ఒక అత్యద్భుత ఆధ్యాత్మిక కేంద్రంగా కూకట్‌పల్లి నిలుస్తుందనడంలో సందేహం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మఠం ప్రతినిధి రామకృష్ణ, ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ బాబూరావు, సీఐ సురేందర్, బాలాజీనగర్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి


కళ్లద్దాలు అందజేస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: ప్రభుత్వం చేపట్టిన రెండో విడత కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. భాగ్యనగర్‌కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో ఏర్పాటు చేసిన కంటివెలుగు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఉచితంగా కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి కళ్లద్దాలను సైతం ఇస్తారని ఆయన అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చిహ్నిత, సూపర్‌వైజర్ రాణి, ఏఎన్‌ఎంలు లలిత, బదమ్మ, జ్యోతి, సులఖన, మేరీ, కాలనీవాసులు దాసు, సైదేశ్వర్‌రావు, చంద్రమౌళి, కృష్ణకుమారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ లీగ్ షురూ


లీగ్ ప్రారంభించి క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: బాలాజీనగర్ డివిజన్ భువన విజయం గ్రౌండ్ వద్ద భువన విజయం క్రికెట్ లీగ్–2023ను శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ బాబురావుతో కలిసి క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ... క్రీడలు ఆరోగ్యాన్ని పరిరక్షించడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుందన్నారు. యువత క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి అంతర్జాతీయ స్థాయిలో దేశానికి మంచి గుర్తింపు తీసుకొచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్రీడలను పోత్సహించే విధంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఇప్పటికే అనేక పార్కులు, క్రీడా మైదానాలు, స్విమ్మింగ్ పూల్స్, షటిల్ కోర్టు నిర్మాణాలు చేపట్టామన్నారు. ఇవన్నీ పిల్లలు, పెద్దలు అందరూ వినియోగించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు.

దసరా సినిమా మాటల రచయితకు సన్మానం


రచయిత గడ్డం సురేష్‌ను సన్మానిస్తున్న జయశంకర్‌నగర్ కాలనీ ప్రతినిధులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: తెలంగాణ భాష, యాసలను ప్రపంచానికి దసరా సినిమా ద్వారా వినిపించిన గడ్డం సురేష్‌ను ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ జయశంకర్‌నగర్ కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. దసరా సినిమాకు మూడు పాటలు రాయడంతో పాటు తెలంగాణ యాసలో మాటలు రాసి ముఖ్య పాత్రలో ఆయన నటించారు. జయశంకర్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న తన చిన్న నాటి మిత్రుడు బెల్లం ఐలయ్యను కలవడానికి రావడంతో జయశంకర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు గుర్తించి ఘన స్వాగతం పలికారు.

ప్రజాప్రతినిధులు సమస్యలను గాలికొదిలేశారు


రిక్షాపుల్లర్స్‌కాలనీలో పర్యటిస్తున్న రవికుమార్‌యాదవ్, నాయకులు

బీజేపీ రాష్ట్ర నేత రవికుమార్ యాదవ్

ఆల్విన్‌కాలనీ: గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రిక్షాపుల్లర్స్ కాలనీలో బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రిక్షాపుల్లర్స్ కాలనీలో అధికార పార్టీ కార్యకర్తలకే దళితబంధు వస్తుందని ఆరోపించారు. నిరుపేదలైన దళితులకు దళితబంధు రాకుండా చేస్తున్నారని అన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలను గాలికొదిలేశారని విమర్శించారు. ఎటు చూసినా దెబ్బతిన్న రోడ్లు, పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు కనిపిస్తున్నాయని అన్నారు. ఇన్ని సమస్యలు ఉన్నా ప్రజాప్రతినిధులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు.

- ఇక్కడ ఎక్కువగా నివసిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఎలాంటి ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. ప్రజల్లో చైతన్యం రావాలనే గల్లీగల్లీలో పర్యటిస్తున్నామని అన్నారు. త్వరలో ఎన్నికల సమరం మోగనున్నదని దానికి అందరూ సంసిద్ధంగా ఉండాలన్నారు. ఓటు నమోదు చేయించుకోని వారు ఓటు నమోదు చేయించుకోవాలని కోరారు. ప్రజల తీర్పే రేపటి భవిష్యత్‌ను నిర్ణయిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, విద్యాకల్పన, శ్రీహరియాదవ్, గోపాల్‌రావు, మనోజ్‌కుమార్, రేపాన్ రాజు, ముత్యాలు, శాలిని, మమత, రేణుక, జయశ్రీ, సైదమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఓయూ సివిల్ సర్వీసెస్ అకాడమిలో శిక్షణ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థులకు మే 1వ తేదీ నుంచి సివిల్ సర్వీసెస్ అకాడమిలో శిక్షణ తరగతులు ప్రారంభంకానున్నాయి. టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1, 2, 3 ఉద్యోగాల రాత పరీక్షలకు సోమవారం మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7.30 గంటల వరకు విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు దళిత క్రైస్తవుల జాతీయ సదస్సు

రాంగోపాల్‌పేట్: ఆల్ ఇండియా క్రిష్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న ఉదయం 10 గంటలకు మిలీనియం ఎస్డీరోడ్డులోని మెథడిస్టు చర్చి ఆవరణలో దళిత క్రైస్తవుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ తెలంగాణ అ. ధ్యక్షులు ఎస్ ప్రదీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎస్సీ, మైనార్టీ అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు వినోద్‌కుమార్, ఫుడ్ కమిషన్ చైర్మన్ రాజీవ్ సాగర్, ఓరుగంటి ఆనంద్, బిషప్స్, పాస్టర్లు, క్రైస్తవ ముఖ్య నాయకులు 33 జిల్లాల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

సంగీత సాధనాలపై వేసవి శిక్షణ తరగతులు

సనత్‌నగర్: షాలోమ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ మ్యూజిక్ ఆధ్వర్యంలో ఎస్‌ఆర్‌నగర్, కూకట్‌పల్లిల్లో ప్రత్యేక వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆంస్థ నిర్వాహకులు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. గిటార్, కీబోర్డు, వయోలిన్, పియానో, డ్రమ్స్, ఓకల్, ఆక్టాప్యాడ్స్, తబలా సంగీత సాధనాలపై 45 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ తరగతులు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగలవారు 94408 79114 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో సప్తదశ వార్షికోత్సవ పూజలు


పూజలో పాల్గొన్న భక్తులు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో సప్తదశ వార్షికోత్సవ, జన్మదిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫౌండర్, చైర్మన్ మేనేజింగ్ ట్రస్టీ కుమారస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి ఆదివారం వరకు ఆలయంలో ప్రత్యే పూజలు ఉంటాయన్నారు. ఆలయంలో నేడు జరిగే పూజలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, సెల్‌వెల్ కార్పొరేషన్ ఎండీ బండారు సుబ్బారావు, ఎంవీవీ సత్యనారాయణ, వర్‌టెక్స్ అధినేత సిజి మురళీమోహన్, ఇమ్మడి జ్యూవెల్లర్స్ అధినేత ఇమ్మడి రమేష్, బుస్సా ఆనంద్, ప్రముఖ సంఘ సేవకులు చికోటి ప్రవీణ్ గుప్తలు హాజరు కానున్నట్లు తెలిపారు.

నేడు, రేపు ఉచిత శిక్షణ

సనత్‌నగర్: బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఎస్సార్‌నగర్ జీహెచ్‌ఎంసీ ప్లేగ్రౌండ్ సమీపంలోని రాజయోగ మెడిటేషన్ సెంటర్‌లో ఈ నెల 29, 30 తేదీల్లో ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 7 సంవత్సరాల వయస్సు నుంచి 14 సంవత్సరాల వయస్సు కలిగిన చిన్నారులకు వ్యాయామ కసరత్తు, పరీక్షల భయం ఏవిధంగా అధిగమించాలి, సులభతరమైన మెడిటేషన్ విధానం, స్ఫూర్తిదాయక కథలు, మెదడుకు పదునుపెట్టే వినోదాత్మక గేమ్స్, పేపర్ క్రాఫ్ట్స్, ఇండోర్ గేమ్స్ కాంపిటేషన్ జరుగుతాయని వివరించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఆయా అంశాల్లో రెండు రోజుల పాటు శిక్షణ కొనసాగుతుందన్నారు. అలాగే 30న ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రత్యేక మెడిటేషన్ తరగతులు జరుగుతాయన్నారు. వివరాలకు 94917 46031 ఫోన్‌నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రజల సంతోషమే ముఖ్యం

అమీర్‌పేట: గాయత్రీనగర్ కాలనీ వాసులు ఎంతో కాలంగా ఎదుర్కొంటున్న వరద ముంపు సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. అమీర్‌పేట డివిజన్‌లో శుక్రవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. నూతన పోలీస్‌స్టేషన్ వద్ద రూ.19 లక్షల వ్యయంతో ఫుట్‌పాత్ నిర్మాణం ,కెకె రెసిడెన్సీ వద్ద రూ.19.50తో సీసీరోడ్డు, బౌద్ధనగర్‌లో సివరేజి పైప్‌లైన్,ఈడబ్ల్యుఎస్ కాలనీలో మంచినీటి పైప్‌లైన్ వస్తున్నట్లు చెప్పారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో దీర్ఘకాలిక సమస్యలు అనేకం పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తొలగించామన్నారు.


అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి తలసాని

భద్రతే ధ్యేయంగా సీసీ కెమెరాల ఏర్పాటు

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ
- వివేకానందనగర్‌లో 220 సీసీ కెమెరాల ప్రారంభం
- బస్తీ, కాలనీవాసులు కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని వినతి


వివేకానందనగర్ కాలనీలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, ఏసీపీ చంద్రశేఖర్

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీ అసోసియేషన్ వారు ఆధ్వర్యంలో 20 లక్షల రూపాయలతో 220 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శుక్రవారం కూకట్‌పల్లి ఏసీపీ చంద్రశేఖర్, సీఐ సురేందర్, కార్పొరేటర్ మాధవరం రోజాదేవిలతో కలిసి సీసీకెమెరాలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీసీ కెమెరాల ఏర్పాటుకు కాలనీ వాసులు ముందుకు రావటం అభినందనీయమన్నారు. ఇతర బస్తీ, కాలనీవాసులు వీరిని ఆదర్శంగా తీసుకొని సీసీ కెమెరాలు ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. రక్షణ, భద్రతే ధ్యేయంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదనపు సీసీ కెమెరాల ఏర్పాటుకు తన వంతు ఆర్థిక సహాయం అందజేస్తానని తెలిపారు.

- ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని అన్నారు. నేర విచారణకు, నివారణకు ఇవి ఎంతగానో తోడ్పాటు అందిస్తాయన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు విస్తృత ప్రచారం చేస్తున్న పోలీసులకు అభినందనలు తెలిపారు. కానీ అధ్యక్షుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు, దేవినేని ప్రసాద్, సత్యనారాయణ, నారాయణరెడ్డి, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, నాయినేని చంద్ర కాంత్‌రావు, కార్తీక్‌రావు, రాంచందర్‌రావు, హిమగిరిరావు, విజయ్ బాబు, అల్లం మహేష్, పాల్గొన్నారు.

నాలా పూడికతీత పనులను వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే


పూడికతీత పనులపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలోని నాలా పూడికతీత పనులను ఇంజినీరింగ్ అధికారులతో శుక్రవారం ఎమ్మెల్యే గాంధీ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని నాలా పూడికతీత పనులను వేగవంతం చేయాలన్నారు. నాలా పరిసరాలు నీట మునిగే పరిస్థితి రావొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, వివేకానందనగర్, మాదాపూర్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు సంజీవరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన వారికి శుక్రవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, చందానగర్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, చంద్రకాంత్‌రావు, కార్తీక్‌రావు, కాశీనాథ్‌యాదవ్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

2083 మందికి కంటి పరీక్షలు

బాలానగర్: బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తొమ్మిది కంటివెలుగు కేంద్రాల్లో శుక్రవారం 2083 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 94మంది కళ్లద్దాలు అందజేశారు. 16 మందికి ప్రత్యేక కళ్లద్దాల కోసం ఆర్డర్ చేశారు. 57 మందిని ఆపరేషన్ కోసం కంటి ఆస్పత్రికి రీఫర్ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు.

ఆస్తిపన్ను చెల్లించండి.. అభివృద్ధికి సహకరించండి


ఆస్తిపన్ను చెక్కును అందుకుంటున్న జెడ్‌సీ మమత

కూకట్‌పల్లి: సకాలంలో ఆస్తిపన్ను చెల్లించి జీహెచ్‌ఎంసీ అభివృద్ధికి సహకరించాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి.మమత పేర్కొన్నారు. శుక్రవారం జెఎన్‌టీయూసీ చెందిన ఆస్తిపన్ను చెక్కును జోనల్ కమిషనర్‌కు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సకాలంలో ఆస్తి పన్ను చెల్లించి కూకట్‌పల్లి నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు.

తాగిన మైకంలో వ్యక్తి ఆత్మహత్య

బాలానగర్: తాగిన మైకంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం... ఆదర్శనగర్‌లో మహేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. మహేష్ తమ్ముడైన సురేష్ (26) హెచ్‌ఐవీ రోగి. కొన్నిరోజులుగా తాగుతూ పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. గురువారం సురేష్ తాగిన మైకంలో తల్లిని కొట్టడంతో ఆమె బంధువుల ఇంటికి వెళ్లింది. శుక్రవారం సాయంత్రం తమ్ముడిని చూసేందుకు సురేష్ అక్క ఆదర్శనగర్‌లోని తమ్ముడు ఉన్న ఇంటికి వచ్చింది. తలుపులు ఎంత కొట్టినా తెరవలేదు. కిటికీలోంచి తొంగి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించాడు. చుట్టుపక్కల వారి సహాయంతో కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి అన్న మహేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బహుళ అంతస్తు పిట్టగోడపై నుంచి పడి వ్యక్తి మృతి

కేపీహెచ్‌బీకాలనీ: ప్రమాదవశాత్తు బహుళ అంతస్తుల భవనం పిట్టగోడపై నుంచి కింద పడిన ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి (35) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కేపీహెచ్‌బీకాలనీలోని రోడ్డు నం.2లోని ఓ బహుళ అంతస్తు భవనంలో అద్దెకు ఉంటున్నాడు. గురువారం రాత్రి 9.30 గంటల సమయంలో మూడో అంతస్తులోని పిట్టగోడపై కూర్చొని ప్రమాదవశాత్తు కిందపడ్డాయి. తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్‌రెడ్డి కుటుంబీకులు, రూమ్‌మేట్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

3 నుంచి నిరుద్యోగ భరోసా బస్సుయాత్ర

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ భరోసా బస్సుయాత్రను చేపట్టనున్నట్లు తెలంగాణ రాష్ట్ర విద్యార్థి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మిడతపల్లి విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ నివాసంలో బస్సు యాత్ర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి బస్సు యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. టీఎస్ జాక్, ఓయూ జేఏసీ, నిరుద్యోగ జేఏసీల ఆధ్వర్యంలో వచ్చే నెల 3న ఉదయం ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీ నుంచి బస్సుయాత్రను ప్రారంభించి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు, విశ్వవిద్యాలయాలలో యాత్రను కొనసాగించనున్నట్లు వివరించారు.

ఓయూలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ పూర్వవిద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్‌లో అభివృద్ధి చెందుతున్న ధోరణులు అనే అంశంపై 2వ అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. శుక్రవారం ఇంజినీరింగ్ కాలేజీ అసెంబ్లీ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి వీసీ ప్రొ.రవీందర్ అధ్యక్షత వహించగా రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభించి మాట్లాడారు. విద్యా సంస్థలు పరిశ్రమల నడుమ సంబంధాలు మెరుగుపడాలని, విద్యార్థుల పై విద్యపరమైన ఒత్తిడి తగ్గించాలని ప్రొ.లింబాద్రి పేర్కొన్నారు. ఇంజినీరింగ్ రంగంలో అత్యధునిక సాంకేతిక అంశాల పై ఓయూ మాజీ వీసీ, అనురాగ్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొ.రాంచంద్రం చర్చించారు.